

పర్చూరులో క్షీరాభిషేకం చేస్తున్న మహిళా భక్తులు


అద్దంకి: అలంకరణలో సాయిబాబా


గన్నవరంలో సాయినామ పారాయణ చేస్తున్న భక్తులు


సంతమాగులూరు: ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ


పేరాల సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

యద్దనపూడి: ఆషాఢమాసం శుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని గురుపౌర్ణమి పూజలు ఆదివారం సాయి ఆలయాల్లో నిర్వహించారు. విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర సహస్ర నామార్చనలు, విశేషపూజలు నిర్వహించారు. పుష్పాలు, పట్టు వస్త్రాలతో మూలవిరాట్‌లను సర్వాంగసుందరంగా అలంకరించారు. కర్పూరంతో అఖండజ్యోతిని వెలిగించారు.

బల్లికురవ: గురువులను ఆరాధిస్తే అన్ని శుభాలే జరుగుతాయని నక్కబొక్కలపాడు, ఉప్పుమాగులూరు ఆలయాల అర్చకులు ఇంకొల్లు మధు బాబు, సుధీర్ శర్మ తెలిపారు. నక్కబొక్కలపాడు శ్రీహనుమత్ షిర్డీ సాయిబాబా అనుగ్రహ ధ్యాన మందిరం, ఉప్పుమాగులూరు గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో పలు పూజలు చేపట్టారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

చీరాల అర్బన్: గురుపౌర్ణమి సందర్భంగా పేరాలలోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక పాపరాజుతోటలోని సాయిబాబా దేవాలయంలో తెల్లవారుజామున పంచామృతాలతో అభిషేకం, అనంతరం బంగారు కిరీటం అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బెస్తపాలెంలో ఎమ్మెల్యే.. విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని మక్కెనవారిపాలెం, వెల్లల చెరువు, కామేపల్లి, మామిళ్ల పల్లి గ్రామాల్లోని ఆలయాల్లో బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.


జె.పంగులూరు: స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు


చినగంజాంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జె.పంగులూరు: మండల పరిధిలోని ముప్పవరం జాతీయ రహదారి వెంబడి ఉన్న శ్రీ లక్ష్మి గణపతి శ్రీ షిర్డీ సాయి బాబా మందిరంలో ఆదివారం గురు పౌర్ణమి నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చిన్నగంజాం: స్థానిక శ్రీ హనుమాన్ సాయి కుటీరంలో వేంచేసియున్న షిరిడీ సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి అభిషేక పూజలు జరిగాయి. మహిళా భక్తులు స్వామి భజనలు నిర్వహించారు.

పర్చూరు(కారంచేడు): గురుపౌర్ణమి పురస్కరించుకొని మండల పర్చూరులో బాబా వారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అద్దంకి రూరల్: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో ఉదయం 5 గంటలనుంచి బాబాకు అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వేటపాలెం: పలు దేవస్థానాల్లో భక్తి శ్రద్ధలతో గురుపూర్ణిమ పూజలు నిర్వహించారు. కొత్తపాలెం రోడ్డులో గల దత్తక్షేత్రంలో దత్తాత్రేయ స్వామికి పంచామృతాలు చేశారు. దేశాయిపేట పంచాయతీ లోగల సాయిబాబా దేవస్థానం, అక్కాయిపాలెం వద్ద గల శిరిడి సాయిబాబు మందిరం వద్ద పూజలు నిర్వహించారు. దత్తక్షేత్రం కన్వీనర్ కె. ప్రమీలాదేవి, అధ్యక్షుడు ప్రతి వెంకట సుబ్బారావు, సెక్రటరీ సున్నా శివప్రసాద్, సహాయ కార్యదర్శి కరణం మురళీకృష్ణ, కోశాదికారి గుర్రం రంగనాయకులు పాల్గొన్నారు.


అద్దంకిలో బాబాను దర్శించుకుంటున్న భక్తులు


వేటపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు


పాపరాజుతోటలోని సాయిబాబా మందిరంలో కిక్కిరిసిన భక్తులు


నక్కబొక్కలపాడులో మృత్యుంజయ హోమంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

కార్యదర్శుల సమావేశం నేడు

చీరాల టౌన్: మండలంలోని కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శోభారాణి ఆదివారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయితీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని సూచించారు.

గురువులకు సత్కారం

చీరాల రూరల్: గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఎన్‌ఆర్‌అండ్‌పీఎం చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ అసోసియేషన్‌లో సభ్యులైన ఉపాధ్యాయులు తిరుమలశెట్టి లక్ష్మీప్రతాప్, చందలూరి బాల వెంకటేశ్వరరావు, కొమ్మూరి వీరాంజనేయులుతో పాటు ప్రతిరోజూ మైదానంలో వ్యాయామాలు చేయించే గురువు అమరా వీరాంజనేయులను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ మాట్లాడారు. గురు పౌర్ణమి నాడు ప్రతిఏటా క్రమం తప్పకుండా గురువులను సత్కరిస్తున్నట్లు చెప్పారు. సెక్రటరీ చారుగుళ్ల గురు ప్రసాద్, జీవై ప్రసాద్, పి. వెంకటస్వామి, డి. తిరుపతిరావు, పూర్ణచంద్రరావు, నారాయణమూర్తి, రాంబాబు, సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లకు 31 వరకు గడువు

బల్లికురవ: ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు జూలై 31 వరకు అడ్మిషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనిల్ కుమార్ ఆదివారం తెలిపారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో తరగతులు నిర్వహిస్తున్నామని ఇప్పటి వరకు 50 మంది వరకు అడ్మిషన్లు పొందారని పదో తరగతి సప్లిమెంటరీలో పాసైన విద్యార్థులు పదో తరగతితో చదువు నిలుపుదల చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గత విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు

చీరాల టౌన్: వర్షాలు కురుస్తున్నందున పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు క్లోరినేషన్ చేస్తున్నామని దేవాంగపురి పంచాయితీ కార్యదర్శి మురళీ బాపూజీ అన్నారు. దేవాంగపురి ఓవర్‌హెడ్ ట్యాంకును క్లోరినేషన్ చేయించారు. అనంతరం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి ఆహార నియమాలు పాటించాలన్నారు.

ఆలయ మాజీ చైర్మన్ మృతి


బాచిన వెంకటేశ్వర్లు (ఫైల్)

జె. పంగులూరు: పంగులూరులోని శ్రీ భీమలింగేశ్వర స్వామి దేవాలయ పాలక మండలి మాజీ చైర్మన్ బాచిన వెంకటేశ్వర్లు (78) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. వెంకటేశ్వర్లు 2018 నుంచి 2024 మార్చి పాలక మండలి చైర్మన్‌గా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాచిన చెంచు ప్రసాద్, పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

రోటరీ క్లబ్‌లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి


రోటరీ క్లబ్ అధ్యక్షునిగా బాధ్యతలు తీసుకుంటున్న షేక్ కాలేషా వలి

జె.పంగులూరు: రోటరీ క్లబ్ కమిటీల్లో మహిళల సంఖ్య పెరిగితే ఆ క్లబ్‌లు సమర్థవంతంగా పనిచేయగలుగుతాయని, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్ అన్నారు. ఆదివారం పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంగులూరు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లడారు. పంగులూరులోని స్టేట్ బ్యాంకు వద్ద గత 15 సంవత్సరాలుగా వినియోగదారులకు ఉచితంగా సేవలు అందిస్తున్న పేర్ని వీరనాయాయణ దంపతులకు క్లబ్ తరుపున సన్మానం చేశారు.

నూతన కార్యవర్గం ఇదే..

క్లబ్ నూతన అధ్యక్షుడిగా షేక్ కాలేషావలి, సెక్రటరీగా రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ బత్తుల వీరనాయణ, కోశాధికారిగా జాగర్లమూడి సుబ్బారావు (జేకేసీ) ప్రమాణ చేశారు. రోటరీ క్లబ్ పంగులూరు క్యాంప్ ఇన్‌చార్జ్ చిలుకూరి వీరరాఘవయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాచిన చెంచుప్రసాద్, గవర్నర్ అపాయింట్మెంట్స్ చైర్మన్ కొల్లా సింగారావు, అసిస్టెంట్ గవర్నర్ తేళ్ల రమేష్ చంద్ర, మాజీ క్లబ్ అధ్యక్షుడు కరణం హనుమంతు రావు సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి


దగ్గుబాడులో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న డాక్టర్ పృథ్వీ

దగ్గుబాడు (కారంచేడు): క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించగలిగితే ఎలాంటి ప్రాణ నష్టం జరగదని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ పృథ్వీ గడ్డం, డాక్టర్ క్యాన్సర్ వైద్య నిపుణులు శివాని చాపరాల అన్నారు. ఆదివారం దగ్గుబాడు పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో చీరాలకు చెందిన 'ప్రాణహిత' మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, క్యాన్సర్ సెంటర్‌కు చెందిన వైద్య నిపుణులు పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు, సేవలందించారు. నలుగురు వ్యక్తులను చీరాల ఆసుపత్రికి రిఫర్ చేశారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, వాటి ప్రభావం, తీవ్రతను గుర్తించుకోవాలని.. ఎలాంటి లక్షణాలు ఉంటే క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలో వివరించారు. 40 సంవత్సరాలు దాటిన ప్రజలు ఈ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, జ్వరం, థైరాయిడ్, తలనొప్పి, పక్షవాతం, కీళ్ళవాతం, గ్యాస్ ట్రబుల్, ఆయాసం, ఊపిరితిత్తులకు సంబంధించిన పరీక్షలు చేశారు.

శాకంబరిగా కామాక్షి అమ్మవారు


శాకంబరిదేవిగా కామాక్షి అమ్మవారు

చీరాల అర్బన్: పట్టణంలోని పాపరాజుతోటలోని శ్రీకామాక్షి సోమేశ్వర ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కనుల పండువగా పొలేరమ్మ కొలుపులు


కారంచేడులో అమ్మవారి కొలుపుల్లో గంగమ్మ చిత్రపటం ఊరేగింపు

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న పోలేరమ్మ తల్లి కొలుపులను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి తలంట్లు దగ్గర నుంచి మధ్యాహ్నం అమ్మవారికి పొంగళ్ళు, నైవేద్యాలు సమర్పించారు. రాత్రికి గ్రామంలోని బందెలదొడ్డి బజారులో వీరతాళ్ళతో నృత్యాలు చేశారు. బాణసంచాలు కాలుస్తూ అమ్మవారి చిత్రపటాన్ని ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గంగమ్మ తల్లీ కాపాడమ్మా!

చీరాల: స్థానిక గొల్లపాలెంలో వేంచేసియున్న గంగమ్మ తల్లికి ఆదివారం భక్తులు మొక్కులు, నైవేద్యాలు చెల్లించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, నాయకులు డాక్టర్ ఎం.మహేంద్రనాథ్ తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

300 మందికి వైద్య పరీక్షలు


చెరుకూరులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చెరుకూరు (కారంచేడు): బాపట్లకు చెందిన యజ్ఞ వైద్యులు చెరుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 300ల మందికి పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. డాక్టర్ బెల్లంకొండ శ్రీకాంత్, డాక్టర్ బెల్లంకొండ మాదవి, డాక్టర్ టి. పవన్‌కుమార్‌లు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత మందులు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి ఉషారాణి, ఎర్రాకుల వెంకట సుబ్బారావు, గ్రామస్తులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండోలో బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

చీరాల: రేపల్లెలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించిన 3వ ఏపీ స్టేట్ లెవల్ తైక్వాండో చాంపియన్ షిప్‌లో పేరాల శ్రీ సాయి విద్యానికేతన్ విద్యార్థి సత్తా చాటాడు. ఏడో తరగతి చదువుతున్న ఆవుల యశ్వంత్ క్యాడెట్ విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. అలానే బాపట్ల సూర్యలంకలోని కేంద్రీయ విద్యాలయంలో ఐదో తరగతి చదువుతున్న సుశాంత్ కళ్యాణ్ సబ్ జూనియర్ విభాగంలో స్టేట్ బంగారు పతకాన్ని సాధించారు. లార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ఎ.కళ్యాణి మాట్లాడుతూ క్రీడలు ఆడటం వలన జీవితంలో క్రమశిక్షణ, మానసిక ఉల్లాసం వస్తుందన్నారు. కోచ్ శాంతి వరప్రసాద్‌ను అభినందించారు. రాజ్‌కుమార్, ఝాన్సీ, అనూష, హేమంత్, శ్రీనివాసరావు, మల్లేశ్వరి, స్కూల్ యాజమాన్యం శుభాకాంక్షలు తెలిపారు.

వెనుకబడిన తరగతులు అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న వక్తలు

చినగంజాం: వెనుక బడిన తరగతుల వారు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని ధనిక్ భారత్ మిషన్ సృష్టికర్త, ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్రమ్ నారాయణ అన్నారు. భారత్ అభివృద్ధి చెందుతున్న దేశంగా ఇంకెంత కాలం చెప్పుకుంటారని ప్రశ్నించారు. దళితులకు రాజ్యాధికారం వస్తుంది కానీ, నిర్ణయాధికారం రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే గిరిజన వాడలు అభివృద్ధి చెందడం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా చూడలన్నదే తమ మిషన్ ముఖ్య లక్ష్యమన్నారు. బాపట్ల జిల్లా, చిన్నగంజాం మండలం, గొనసపూడిలో ధనిక్ భారత్ మిషన్ ఆధ్వర్యంలో జరిగిన చర్చా వేదికలో పలువురు మేధావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదికపై ఉన్న మేధావులు అడిగిన పలు ప్రశ్నలకు విక్రమ్ నారాయణ సమాధానం ఇచ్చారు. ఆర్థిక, రాజకీయ రంగాల్లో అంతా సమానంగా ఉండాలని ఆయన విక్రమ్ నారాయణ అభిప్రాయపడ్డారు. తరతరాలుగా దళితులు అణచివేస్తున్నారన్నారు. దళితులకు ప్రత్యేక పంచాయతీలు, నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రిజర్వేషన్లతో పాటు క్రీమీలేయర్ పద్ధతి కూడా అవలంబించాలని సూచించారు. చీరాల కళాశాల ప్రిన్సిపాల్ పొగడదని రవికుమార్ దేవతోటి సుందర్రావు నాగార్జున, మెడపల్లి సునీల్ విక్రమ్, అజయ్ బాబు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత భీమనాథం అంజిరెడ్డి మృతి


అంజిరెడ్డి (ఫైల్)


నివాళులర్పిస్తున్న పానెం చిన హనిమిరెడ్డి, భద్రారెడ్డి

జె. పంగులూరు: మండల పరిధిలోని కొండమూరు గ్రామానికి చెందిన మండల వైఎస్సార్ సీపీ నేత భీమనాథం అంజిరెడ్డి (62) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం అనాగ్యోంతో ఉన్న భీమనాథం అంజిరెడ్డిని కుటుంబ సభ్యులు గుంటూరు ప్రయివేటు వైద్యశాలకు తీసుకెళ్ళారు. అక్కడ చికిత్స తీసుకుంటూ ఆదివారం మృతి చెందాడు. మృత దేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామం కొండమూరు తీసుకొచ్చారు. అద్దంకి నియోజక వర్గ వైఎసాస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పానెం చిన హనమిరెడ్డి, అద్దంకి మార్కెట్ యార్డ్ మాజి చైర్మన్ వైవీ భద్రారెడ్డి కొండమూరు వచ్చి, భీమనాథం అంజిరెడ్డికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కన్వీనర్ స్వయంపు హనుమంతు రావు, అద్దంకి ఏఎంసీ చైర్మన్ జజ్జర ఆనందరావు, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు పులికం కోటిరెడ్డి, జంపాని రవిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు జంపాని రాజ, ఆదిరెడ్డి, నాగేశ్వరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సముద్ర స్నానాలతో జాగ్రత్త


అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివకుమార్

చీరాల: సముద్రతీరానికి వస్తున్న పర్యాటకులు పోలీసులు నిబంధనలు పాటించాలని ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ సూచించారు. ఆదివారం వాడరేవు, రామాపురం బీచ్‌లో పర్యాటకులకు ఎస్సై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడు ప్రాంతాల్లోనే సముద్రస్నానాలు ఆచరించాలన్నారు. సముద్రంలో ఏర్పాటు చేసిన ఎర్రజెండాలను దాటి లోపలికి వెళ్ళవద్దని హెచ్చరించారు. లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్ళను సిద్ధం చేశామని వివరించారు.

స. హ చట్టంపై అవగాహన ఉండాలి

కారంచేడు: సమాజంలో ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఏపీ సమాచార కమిషనర్ చావలి సునీల్ ఆదేశాల మేరకు శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఏఓ సుధీర్‌బాబు మాట్లాడారు. 2005 మే 11న ఈ చట్టం పార్లమెంట్‌లో ఆమోదం పొందిందని తెలిపారు. అదే సంవత్సరం జూన్ 15న రాష్ట్రపతి ఆమోదం, అక్టోబర్ 12వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు జవాబుదారీతనంగా, పారదర్శకంగా పనిచేస్తుందన్నారు. కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్ర సమాచార కమిషన్‌లు ఈ చట్టంలో ఉంటాయని తెలిపారు. ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే అభివృద్ధితో పాటు, అవినీతిని సైతం తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీటీ సుశీల, ఎంఈఓ-2 మొలబంటి వెంకటేశ్వర్లు, విద్యుత్ ఏఈ రాంబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హిమబిందు, వీఆర్‌ఓలు, వీఏఏలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.